6న ఓటరు జాబితా ఫైనల్ పబ్లికేషన్

వివిధ పార్టీల నాయకులతో మాట్లాడుతున్న తహసీల్దార్ విజయ్‌కుమార్

కొడంగల్, డిసెంబర్ 2: ఈ నెల 6వ తేదీన ఓటరు జాబితాకు సంబంధించి ఫైనల్ పబ్లికేషన్ ఉంటుందని తహసీల్దార్ విజయ్‌కుమార్ తెలిపారు. గురువారం తహసీల్దార్ కార్యాలయంలో వివిధ పార్టీ నాయకులతో ప్రత్యేక సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2025 ఓటరు జాబితా ఈనెల 6వ తేదీన పూర్తి కానుందని, అందులో కొత్త ఓటర్లు ఎంత మంది చేరారు, తీసివేత వంటి వివరాలు తెలుసుకోవచ్చని పేర్కొన్నారు. ఓటరు జాబితా తయారీలో పార్టీ నాయకుల పూర్తి సహకారం ఉందని తెలిపారు. కార్యక్రమంలో ఆయా పార్టీ నాయకులు రమేశ్‌బాబు, కృష్ణాయాదవ్, ఇందనూరు బషీర్, శంకర్‌నాయక్, కృష్ణంరాజులతో పాటు రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

క్యాలెండర్ ఆవిష్కరణ...

వికారాబాద్, జనవరి 2 : వికారాబాద్ పట్టణంలోని తన నివాసంలో, 2025 నూతన సంవత్సర క్యాలెండర్ ను గురువారం బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే డాక్టర్ మెతుకు ఆనంద్ ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ఆయా మండలాల అధ్యక్షులు వెంకన్న, సుందరి అనిల్, కోట్ పల్లి మండల సర్పంచుల సంఘం మాజీ అధ్యక్షుడు వెంకటేశ్ యాదవ్, మోమిన్ పేట్ మండల యువజన విభాగం అధ్యక్షుడు తిరుపతి రెడ్డి, కోట్ పల్లి మండల యువజన విభాగం అధ్యక్షులు కొండల్ రెడ్డి, నాయకులు తొర్మామిడి అచ్చుత్ రెడ్డి, బంటారం అశోక్ కుమార్, కే గోపాల్, మాల సోమవారం శ్రీనివాస్, మోమిన్ పేట్ మండల యువ నాయకులు జుబేర్, పర్వేజ్ తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలకు శిక్షణా ఫౌండేషన్ చేయూత

డిజిటల్ క్లాస్ రూమ్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే యాదయ్య

నవాబుపేట, జనవరి 2: మండల పరిధిలోని పులుమామిడి గ్రామ ప్రాథమిక పాఠశాలకు 'శిక్షణా ఫౌండేషన్' స్వచ్ఛంద సంస్థ రూ. రెండు లక్షలు విలువజేసే ఎల్ఈడీ టీవీ, జీయో ఫైబర్‌ను అందజేశారు. గురువారం జరిగిన ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా స్థానిక ఎమ్మెల్యే యాదయ్య హాజరయ్యారు. శిక్షణ ఫౌండేషన్ రాష్ట్ర ఇన్‌చార్జి కాశీనాథ్ మాట్లాడుతూ 2019 నుంచి వికారాబాద్ జిల్లాలో డెల్ వంటి పెద్ద పెద్ద సంస్థల సహకారంతో 12 పాఠశాలలకు ఇలాంటి సేవ కార్యక్రమాలు చేస్తున్నట్లు గుర్తుజేశారు. కార్యక్రమంలో పీఏసీఎస్ రాంరెడ్డి, ఏఎంసీ చైర్మన్ గీతాసింగ్, ఎంఈవో అబ్దుల్ రహమాన్, పాఠశాల హెచ్ఎం, ఉపాధ్యాయులు గోపాల్, విజయలక్ష్మి, పూలమ్మ, పంచాయతీ కార్యదర్శి నితీన్ పాల్గొన్నారు.

సీసీ రోడ్డు పనులు ప్రారంభం

బంట్వారం, జనవరి 2: మండల పరిధిలోని బస్వాపూర్ గ్రామంలో ఎస్‌డీఎఫ్ నిధులు రూ పది లక్షలతో నిర్మిస్తున్న సీసీ రోడ్డు పనులను మార్కెట్ కమిటీ చైర్మన్ మహేందర్ రెడ్డి గురువారం ప్రారంభించారు. కార్యక్రమంలో డైరెక్టర్లు శాఖం నర్సింహులు, పోచారం యాదగిరి, తలారి వెంకటేశం, అంజన్న, మోహన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అరుణాచల్‌ప్రదేశ్ అండర్-23 క్రికెట్ జట్టుకు తెలుగు కుర్రాడు

రాపోల్ సాయి సంతోష్

మన్సూరాబాద్, జనవరి 2: హైదరాబాద్, ఎల్బీనగర్‌కు చెందిన రాపోల్ సాయి సంతోష్ దేశవాళీ 2024-25 సీజన్‌లో అరుణాచల్‌ప్రదేశ్ అండర్-23 క్రికెట్ టీమ్‌కు ఎంపికయ్యాడు. బీసీసీఐ మెన్స్ అండర్-23 స్టేట్-ఏ ట్రోఫీ కోసం జరుగనున్న పోటీలకు అరుణాచల్‌ప్రదేశ్ క్రికెట్ జట్టు తరపున ఆడనున్నాడు. 21 ఏండ్ల రాపోల్ సంతోష్ బౌలింగ్ ఆల్‌రౌండర్, ఫాస్ట్ బౌలింగ్‌తోపాటు బ్యాటింగ్‌లోనూ విశేష ప్రతిభ కనబర్చాడు. గత సంవత్సర కాలంగా అరుణాచల్‌ప్రదేశ్‌లో జరిగిన వివిధ టోర్నమెంట్లలో సంతోష్ పాల్గొని మంచి నైపుణ్యాన్ని ప్రదర్శించాడు. అతడిలోని ప్రతిభను గుర్తించిన సెలెక్టర్లు సంతోష్‌ను అరుణాచల్‌ప్రదేశ్ అండర్-23 జట్టుకు ఎంపిక చేశారు. పన్నెండు సంవత్సరాల వయస్సు నుంచి క్రికెట్ ఆడటం మొదలు పెట్టిన సంతోష్ అనతి కాలంలోనే అద్భుత ప్రతిభ కనబరుస్తూ జాతీయ స్థాయి అండర్-16, అండర్-17 స్కూల్ గేమ్స్‌లో తెలంగాణ జట్టుకు ప్రాతినిథ్యం వహించాడు. అండర్-16 విజయ్‌మర్చంట్ ట్రోఫీలోనూ పాల్గొని మంచి ప్రతిభ కనబరిచాడు. హైదరాబాద్‌కు చెందిన కె.వినోద్‌కుమార్, బీఏజీ వాల్టర్ వద్ద శిక్షణ పొంది క్రికెట్‌లో మెలకువలు నేర్చుకున్నాడు.

మహా కుంభమేళాకు 26 ప్రత్యేక రైళ్లు

హైదరాబాద్, జనవరి 2(నమస్తే తెలంగాణ): మహా కుంభమేళాకు 26 అదనపు ప్రత్యేక రైళ్లను ఏర్పాటు చేసినట్లు గురువారం ఎస్‌సీఆర్ అధికారులు తెలిపారు. గుంటూరు, విజయవాడ, మౌలాలి, కాచిగూడ, సికింద్రాబాద్, వికారాబాద్, నాందేడ్ వంటి రైల్వే స్టేషన్ల నుంచి కుంభమేళాకు ఫిబ్రవరి 5నుంచి 27 వరకు షెడ్యూల్ వారీగా ప్రత్యేక రైళ్లు నడుస్తాయని అధికారులు పేర్కొన్నారు. పూర్తి వివరాలకు ఎస్‌సీఆర్ వెబ్‌సైట్‌ను సంప్రదించాలన్నారు.

అనుమతి లేకుండా భవనం కూల్చివేత

- గ్రామపంచాయతీ కార్యదర్శి అత్యుత్సాహం
- గతంలో వచ్చిన ఆరోపణలపై చర్యలు చేపట్టని అధికారులు

పరిగి, జనవరి 2 : ఏదైనా ప్రభుత్వ భవనం కూల్చివేయాలంటే ఉన్నతాధికారుల అనుమతి తప్పనిసరి. అలాంటిది అధికారులకు తెలియకుండానే గ్రామపంచాయతీ పాత భవనాన్ని కూల్చివేయడం పట్ల తీవ్ర విమర్శలు వస్తున్నాయి. పరిగి మండలం నస్కల్ గ్రామంలో గల పాత గ్రామపంచాయతీ భవనాన్ని గురువారం పంచాయతీ కార్యదర్శి జేసీబీతో కూల్చివేయించారు. డ్వాక్రా భవనం నిర్మాణానికి నిధులు వస్తున్నాయంటూ అధికార పార్టీ నేతలు చెప్పినట్లుగా విన డం వల్లే పాత భవనాన్ని కూల్చివేసినట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఏదైనా భవనం కూల్చివేయాలంటే సంబంధిత ఉన్నతాధికారుల అనుమతి తప్పనిసరిగా తీసుకోవాల్సి ఉంటుంది. అలాంటిది ఏమి లేకుండానే గురువారం మధ్యాహ్నం గ్రామంలో ప్రజలు తమ పొలం పనులకు వెళ్లిన తర్వాత గ్రామపంచాయతీ పాత భవనాన్ని జేసీబీతో కూల్చివేయడం విమర్శలకు తావిస్తున్నది. సాధారణంగా భవనం కూల్చివేయాలంటే గ్రామపంచాయతీ తీర్మానం చేసి ఉన్నతాధికారులకు పంపించడంతోపాటు భవనం నివాసయోగ్యంగా లేదని ఇంజినీరింగ్ అధికారుల ధ్రువీకరణ తర్వాతే కూల్చివేత చేపట్టాలి. భవనం కూల్చివేత విషయమై మండల పంచాయతీ అధికారిని అడుగగా తమకు ఏమి తెలియదని, తమ దృష్టికి రాలేదని, తమ అనుమతి ఎవరూ తీసుకోలేదని చెప్పడం గమనార్హం. మరోవైపు నస్కల్ గ్రామపంచాయతీ కార్యదర్శిపై ఇప్పటికే అనేక ఆరోపణలు ఉన్నాయి. నిధుల దుర్వినియోగంతోపాటు ఇంటి నిర్మాణ అనుమతులు అక్రమంగా ఇచ్చారని గ్రామస్తులు చేసిన ఫిర్యాదుతో డీఎల్‌పీవో విచారణ జరిపినా ఇప్పటివరకు ఎలాంటి చర్యలు తీసుకోలేదు. మరోవైపు అనుమతులు లేకుండా పాత భవనం కూల్చివేత విషయంలో స్థానిక అధికార పార్టీ నాయకుల ఒత్తిడే కారణంగా తెలుస్తున్నది. ఉన్నతాధికారుల అనుమతులు లేకుండా పాత గ్రామపంచాయతీ భవనం కూల్చివేతకు సంబంధించి గ్రామ పంచాయతీ కార్యదర్శిపై చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.

జేసీబీతో గ్రామపంచాయతీ పాత భవనాన్ని కూల్చివేస్తున్న దృశ్యం

బైక్‌ను ఢీకొట్టిన లారీ
కర్ణాటక వాసి మృతి

పరిగి, జనవరి 2: ఎదురుగా వస్తున్న మోటార్ సైకిల్‌ను లారీ ఢీకొట్టడంతో కర్ణాటకకు చెందిన ఒక వ్యక్తి మృతి చెందాడు. ఈ ఘటన పరిగి పట్టణ శివారులో గురువారం ఉదయం జరిగింది. ఎస్ఐ సంతోష్‌కుమార్ అందించిన వివరాల ప్రకారం కర్ణాటకలోని కొత్రికకు చెందిన శాంతకుమార్ మోటార్ సైకిల్‌పై హైదరాబాద్ నుంచి తమ స్వగ్రామానికి వెళ్తుండగా గురువారం ఉదయం 8 గంటల ప్రాంతంలో పరిగి పట్టణ శివారులోని ఏబీఎస్ ప్లాజీ సమీపంలో ఎదురుగా వస్తున్న లారీ ఢీకొట్టింది. ఈ ఘటనలో మోటా ర్‌సైకిల్‌పై వెళ్తున్న శాంతకుమార్ తలకు, కాలికి బలమైన గాయాలై అక్కడికక్కడే మృతిచెందాడు.
పోలీసులు శాంతకుమార్ శవాన్ని పరిగి ఆసుపత్రికి తరలించారు. శాంతకుమార్ తండ్రి నర్సప్ప ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యా ప్తు చేస్తున్నట్లు ఎస్ఐ సంతోష్‌కుమార్ తెలిపారు.

పీఎం కిసాన్ క్రెడిట్ కార్డులపై అవగాహన

సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా మత్స్య శాఖ అధికారి వెంకటయ్య, హాజరైన మత్స్యకారులు

వికారాబాద్, జనవరి 2: మత్స్య కారులు పీఎం కిసాన్ క్రెడిట్ కార్డ్‌లపై అవగాహన పెంచుకోవాలని జిల్లా మత్స్య శాఖ అధికారి వెంకటయ్య సూచించారు. గురువారం వికారాబాద్ మండల పరిధిలోని గొట్టిముక్కల గ్రామంలోని మత్స్యకారులకు క్రెడిట్ కార్డులతో రుణాలు మంజూరు చేసే కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బ్యాంకుల నుంచి రుణాలు మంజూరు చేసేందుకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించినట్లు తెలిపారు. ఆసక్తి గలవారు ఖాతా ఏ బ్యాంకులో ఉంటే ఆ బ్యాంకును సంప్రదించి దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. పీఎం ఓకిసాన్ క్రెడిట్ కార్డుల ద్వారా పొందే రుణాలకు 2% వడ్డీ తక్కువగా ఉంటుందన్నారు. వాయిదాలు సకాలంలో చెల్లిస్తే.... అదనంగా ఇంకో 3% వడ్డీ తక్కువ చేస్తాయన్నారు. జిల్లా లోని మత్స్యకారులందరూ ఈ అవకాశాన్ని ఉపయోగించుకోవాలని సూచించారు. దరఖాస్తులు జిల్లా మత్స్య శాఖ అధికారి కార్యాలయంలో పొందవచ్చన్నారు. కార్యక్ర మంలో జిల్లా పశు సంవర్ధక అధికారి డాక్టర్ సదానందం, లీడ్ బ్యాంక్ మేనేజర్ యాదగిరి, సంఘం అధ్యక్షుడు ఎల్.లక్ష్మయ్య, సంఘం సభ్యులు పాల్గొన్నారు.

పెద్దేముల్, జనవరి 2: మండల పీఆర్టీయూ టీఎస్ 2025 క్యాలెండర్ ఎమ్మార్సీ కార్యాలయంలో గురువారం మండల విద్యాధికారి నర్సింగ్‌రావు , తహసీల్దార్ వెంకటేశ్ ప్రసాద్ ఆవిష్కరించారు. కార్యక్రమంలో కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు అక్కమా దేవి, సునీత, బోజప్ప, పీఆర్టీయూ మండల అధ్యక్షుడు నవీన్‌కుమార్, ప్రధాన కార్యదర్శి వెంకట్‌రెడ్డి, రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు ద్యావరి నరేందర్ రెడ్డి, రాష్ట్ర కార్యదర్శి ఆనంద్‌కుమార్, గొబ్రా్య నాయక్, రవికాంత్‌రెడ్డి, శంకర్, మండల అసోసియేట్ అధ్యక్షుడు బందెప్ప, సాదియా అహ్మది, కె. వి. రమణారావ్, బి. రాజశేఖర్, నర్సిరెడ్డి, అన్నపూర్ణ పాల్గొన్నారు.

బాలుడి అదృశ్యం..



యాలాల, జనవరి 2: తాండూరు పట్టణంలోని పాత తాండూరుకు చెందిన బాలు డు అదృశ్య మయ్యాడు.
బాధిత కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం... పాత తాండూరుకు చెందిన మహ్మద్ ఫేరో జ్ కొడుకు సమీర్(14) బుధవారం ఇంటి వద్ద నున్న మసీదుకు నమాజ్ చది వేం దుకు వెళ్లి ఇంటికి వచ్చిన తర్వాత భోజనం చేసి బయటకు వెళ్లాడు. రాత్రి అయినా తిరిగి రాకపోవడంతో కుటుంబ సభ్యులు చుట్టుపక్కల. బంధువుల, సన్ని హితుల, స్నేహితుల ఇండ్ల ల్లో వాకబు చేసినా ప్రయో జనం లేకపోవడంతో పట్టణ పోలీస్ స్టేషన్ లో గురువారం ఫిర్యాదు చేశారు.

ఉచిత వైద్యం..

పూడూరు, జనవరి 2: పూడూరు మండలం హైదరాబాద్ బీజాపూర్ హైవే రోడ్డు పక్కనే ఉన్న షిర్డీ సాయి మందిరంలో డాక్టర్ ఏఎస్ నారాయణ ఆధ్వర్యంలో కంటి, దంత, ఇతర ఆరోగ్య సమస్యలు ఉన్న సుమారు 155 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులను అందజేశారు. కంటి సమస్యతో బాధపడుతున్న వారిని శస్త్ర చికిత్సలకై హైదరాబాద్‌కు సొంత వాహనాల్లో తీసుకువెళ్లారు. కార్యక్రమంలో పలువురు వైద్యులు పాల్గొన్నారు.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కుల పంపిణీ

పూడూరు, జనవరి 2: పూడూరు మండల పరిధిలోని పెద్ద ఉమ్మెం తాల్, కంకల్, చింతల్‌పల్లి, పూడూరు గ్రామాల లబ్ధిదారులకు గురువారం సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను పీఏసీఎస్ చైర్మన్ సతీశ్‌రెడ్డి, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు ఎస్. సురేందర్‌లు అందజేశారు. కార్యక్రమంలో నాయకులు అజీంపటేల్, సుబాస్, వీరేశ్, బాలమణి, రహీమ్ తదితరులు ఉన్నారు.

బావిలో దూకి ఆత్మహత్య

తాండూరు రూరల్, జనవరి 2: ఓ వ్యక్తి బావిలో దూకి ఆత్మహత్య చేసుకున్న ఘటన కరణ్‌కోట పోలీసు స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. ఎస్సై విఠల్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం...తాండూరు మండలం, కరణ్‌కోట గ్రామానికి చెందిన నరేష్ (23) మద్యం మత్తులో గ్రామంలోని ఓ బావిలో దూకి ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడి సోదరుడు పాలేపల్లి లక్ష్మప్ప ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై తెలిపారు.

పేకాట స్థావరంపై దాడి

బంట్వారం , జనవరి 2 : మండల పరిధిలోని మంగ్రాస్‌పల్లి గ్రామ శివారులో పేకాట ఆడుతున్నారని సమాచారం అందడంతో ఎస్ఐ శ్రీశైలం తన సిబ్బందితో వెళ్లి దాడి జరిపి పది మందిని అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద నుంచి రూ నాలుగు వేలు, కార్డ్స్‌ను స్వాధీనం చేసుకున్నారు. వీరిపై కేసు నమోదు చేసినట్లు చెప్పారు.

బైక్‌పై నుంచి పడి తీవ్రగాయాలు

కులకచర్ల, జనవరి 2: కులకచర్ల మండలం సాల్వీడ్ గ్రామానికి చెందిన చీపిరి అంజిలయ్య కులకచర్ల నుంచి సాల్వీడ్‌కు వెళుతున్న సమయంలో పాంబండ ప్రాంతంలో ఎదురుగా కారు వస్తుం డటంతో కారును తప్పించబోయి రోడ్డు పక్కకు పడిపోవడంతో తీవ్ర గాయాల య్యాయి. చికిత్స కోసం నిమ్స్‌కు తరలించినట్లు సమాచారం.

'సెట్విన్'లో కొత్త కోర్సులు

చార్మినార్, జనవరి 2: నిరుద్యోగ యువతీ యువకులకు మరింత మెరుగైన శిక్షణ అందించడానికి సెట్విన్ కొత్త కోర్సులను ప్రారంభించడానికి సన్నాహాలు చేస్తున్నదని సెట్విన్ మేనేజింగ్ డైరెక్టర్ కె.వేణుగోపాల్‌రావు తెలిపారు. గురువారం ఆయన సెట్విన్ కేంద్ర కార్యాలయంలో మాట్లాడుతూ.. రానున్న రోజుల్లో ఈవీ మోటారు వాహనాలు విస్తృతంగా వినియోగంలోకి రానున్నాయని, ఈ నేపథ్యంలో ఆ రంగంలో యువత మరింతగా రాణించడానికి అనుగుణంగా ఈవీ కోర్సులను అందుబాటులోకి తీసుకువస్తున్నామని ఆయన తెలిపారు. ప్రస్తుతం ఈ కోర్సును నల్గొండలో అందుబాటులోకి తీసుకువచ్చామని చెప్పారు. ఈవీ కోర్సును త్వరలో పాతనగరంలోని మిరాలం ట్యాంక్‌లోని సెట్విన్ శిక్షణ కేంద్రంలోనూ అందుబాటులోకి తీసుకురానున్నట్లు తెలిపారు. కొత్త కోర్సులను సెట్విన్‌లో అందుబాటులోకి తీసుకువస్తూ మరిన్ని కేంద్రాలను సైతం గ్రామీణ యువతకు అందుబాటులోకి తీసుకువస్తున్నామని తెలిపారు. జహీరాబాద్‌తోపాటు మహబూబ్‌నగర్, నాగర్‌కర్నూల్, జడ్చర్ల ప్రాంతాల్లోనూ సెట్విన్ శిక్షణ కేంద్రాలను అందుబాటులోకి తీసుకురావడానికి చర్యలు తీసుకుంటున్నామని ఆయన తెలిపారు. ప్రస్తుతం సెట్విన్ ఆధ్వర్యంలో ఆన్‌లైన్, ఆఫ్‌లైన్‌లోనూ 30 కోర్సులు అందుబాటులో ఉన్నాయని, మరిన్ని కోర్సులను అందుబాటులోకి తీసుకురావడానికి కృషి చేస్తున్నామని తెలిపారు. సెట్విన్ ఆధ్వర్యంలో మెరుగైన శిక్షణ కల్పించి ఉపాధి అవకాశాలు అందించేందుకు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. డిప్లొమా ఫ్యాషన్ టెక్నాలజీతోపాటు పైథాన్, టూరిజం మేనేజ్‌మెంట్ లాంటి కోర్సులతోపాటు యువతకు మెరుగైన అవకాశాలు కల్పించే కోర్సులను సెట్విన్‌లో అందిస్తున్నామని వేణుగోపాల్‌రావు తెలిపారు.

కులకచర్ల, జనవరి 2 : మండల పరిధిలోని ముజాహిద్‌పూర్ గ్రామానికి చెందిన చౌడాపూర్ యాదయ్యకు ఆస్పత్రి ఖర్చుల నిమిత్తం రూ. లక్షా 20వేల సీఎంఆర్‌ఎఫ్ చెక్కును కులకచర్ల మార్కెట్ కమిటి చైర్మన్ బీఎస్ ఆంజనేయులుఅందజేశారు. కార్యక్రమంలో మాజీ ఉప సర్పంచ్ దేశ్‌ముఖ్ చంద్రభూపాల్‌రావు, నాయకులు బోయిని కృష్ణయ్య, బాలకృష్ణయ్య, సోమలింగం, వెంకటేశ్, నవీన్, వెంకట్‌రావు, అంజి, బందయ్య, పెంటయ్య, బాలయ్య పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

పరిగి, జనవరి 2 :గుర్తు తెలియని వాహనాన్ని మోటార్‌సైకిల్ ఢీకొని ఒక వ్యక్తి మృతిచెందారు. ఈ సంఘటన పరిగి మండలం సాలిప్పలబాటతాండ సమీపంలో గురువారం రాత్రి జరిగింది. బొంరాస్‌పేట్ మండలం మదనపల్లికి చెందిన చాకలి అశోక్(28) షాద్‌నగర్‌లో హోటల్‌లో పనిచేసేందుకు మోటార్‌సైకిల్‌పై వెళ్తుండగా ఈ ప్రమాదం చోటు చేసుకుంది. గురువారం రాత్రి 8 గంటల ప్రాంతంలో మోటార్‌సైకిల్‌పై అశోక్ షాద్‌నగర్‌కు వెళ్తుండగా సాలిప్పలబాటతాండ సమీపంలో ప్రధాన రహదారిపై ఆగి ఉన్న గుర్తు తెలియని వాహనాన్ని వెనకాల నుంచి ఢీకొట్టాడు. ఈ సంఘటనలో తీవ్ర గాయాలపాలైన అశోక్ మృతిచెందాడు. ఇదిలావుండగా అశోక్‌కు గత వారమే ఎంగేజ్‌మెంట్ అయినట్లు సమాచారం.

బాల్కనీలో పడి బాలిక మృతి

ఘట్‌కేసర్, జనవరి 2: ఇంట్లోని బాల్కనీలో పడి ఓ బాలిక మృతి చెందిన సంఘటన బుధవారం రాత్రి జరిగింది. పోచారం పోలీసులు తెలిపిన ప్రకారం.. పోచారంలోని రెడ్డి నివాసంలో ఉండే వాసచంద్రశేఖర్ కుమార్తె వాస శ్రీజ(16) ఇంటి బాల్కానిలో ప్రమాదవశాత్తు పడిపోగా ఉప్పల్ సమీపంలోని ఓ దవాఖానకు తరలించారు. అక్కడి నుంచి మెరుగైన వైద్యం కోసం సికింద్రాబాద్‌లోని గాంధీ దవాఖానకు తరలించారు. చికిత్స పొందుతూ శ్రీజ మృతి చెందినట్లు తెలిపారు. పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

మద్యం మత్తులో గొడవ.. ఉరేసుకొని ఒకరి ఆత్మహత్య


మృతుడు ధర్మ(ఫైల్)

బంజారాహిల్స్, జనవరి 2: రోజంతా మద్యం తాగుతుండటంతోపాటు సహజీవనం చేస్తున్న మహిళతో గొడవపడిన ఓ వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. బంజారాహిల్స్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకున్న ఈ ఘటన వివరాలిలా ఉన్నాయి. కాకినాడ ప్రాంతానికి చెందిన ధర్మ(35) అనే వ్యక్తి సినిమా షూటింగ్స్‌లో ఆర్ట్ డిపార్ట్‌మెంట్స్‌లో పని చేస్తుంటాడు. భార్యతో గొడవపడి వేరుగా ఉంటున్న ధర్మకు నాలుగేళ్ల కిందట మల్లమ్మ(39) అనే మహిళతో పరిచయం ఏర్పడింది. అప్పటి నుంచి వారిద్దరూ కలిసి ఇందిరానగర్‌లో ఓ గది అద్దెకు తీసుకుని నివాసం ఉంటున్నారు. కాగా, బుధవారం నూతన సంవత్సరం కావడంతో ఫ్రెండ్స్‌తో రోజంతా మద్యం సేవించిన ధర్మ సాయంత్రం ఇంటికి వచ్చాడు. అనంతరం రాత్రి 7.30గంటల సమయంలో మరోసారి మద్యం తెచ్చుకుని దూరపు బంధువైన దుర్గ అనే వ్యక్తితో కూర్చుని తాగుతున్నాడు. అయితే రోజంతా తాగేసి వచ్చావు.. మళ్లీ ఎందుకు తాగుతున్నావంటూ మల్లమ్మ ప్రశ్నించింది. దాంతో వారిద్దరి మధ్య గొడవ జరిగింది. అంతటితో ఆగకుండా ఆమెపై దాడి చేశాడు. రాత్రి 10.30 గంటల సమయంలో మరోసారి ఆమెపై దాడి చేసి ఇంట్లోంచి బయటకు పంపించాడు. అనంతరం అర్ధరాత్రి 12 గంటల సమయంలో ఇంటి నుంచి బయటకు వచ్చి సుమారు గంటసేపు ఆమె బయటనే కూర్చున్నది. ఆ తర్వాత ఇంట్లోకి వెళ్లేందుకు ప్రయత్నించగా.. తలుపులు వేసుకొని ఫ్యాన్‌కు చీరతో ఉరేసుకున్న కనిపించాడు. దీంతో ఆమె గట్టిగా కేకలు వేయడంతో స్థానికులు వచ్చి తలుపులు పగులగొట్టి చూడగా.. అతడు అప్పటికే మృతి చెంది ఉన్నాడు. బంజారాహిల్స్ పోలీసులు మృతదేహాన్ని పోస్ట్‌మార్టం నిమిత్తం దవాఖానకు తరలించి కేసు దర్యాప్తు చేపట్టారు.

డ్రగ్స్ విక్రయానికి ప్లాన్.. ప్లాస్టిక్ వ్యాపారి అరెస్ట్

సిటీబ్యూరో, జనవరి 2(నమస్తే తెలంగాణ): న్యూ ఇయర్ వేడుకలకు డ్రగ్స్ విక్రయించేందుకు యత్నించిన ఓ యువకుడిని వెస్ట్‌జోన్ టాస్క్‌ఫోర్స్ పోలీసులు అరెస్ట్ చేశారు. డీసీపీ సుధీంద్ర కథనం ప్రకారం... ప్లాస్టిక్ వ్యాపారం నిర్వహించే జవహర్ కిషన్ గోపాల్ బంజారాహిల్స్ రోడ్డు నం.12లో నివాసముంటాడు. బెట్టింగ్‌లకు అలవాటు పడటంతో ఆర్థిక సమస్యలు చుట్టుముట్టాయి. దీంతో ఈజీగా డబ్బు సంపాదించేందుకు అతడి స్నేహితులైన అనిల్, వరుణ్, ప్రమోద్‌లు డ్రగ్స్ వ్యాపారంలో డబ్బు సంపాదించవచ్చంటూ ప్రోత్సహించారు. ఈ నేపథ్యంలోనే ముంబైలో ఉన్న ఓ నైజీరియన్‌ను కాంటాక్టు అయిన గోపాల్ ముంబై వెళ్లి 30 గ్రాముల కొకైన్, ఎండీఎంఏ డ్రగ్స్ తీసుకొని హైదరాబాద్‌కు వచ్చాడు. న్యూ ఇయర్ వేడుకల సందర్భంగా ఎక్కువ ధరకు విక్రయించాలనే ప్లాన్‌లో ఉండగా... మాసబ్ ట్యాంక్ పోలీసులతో కలిసి టాస్క్ ఫోర్స్ పోలీసులు పట్టుకున్నారు. నిందితుడిని అరెస్ట్ చేసి అతడి వద్ద నుంచి కొకైన్, ఎండీఎంఏ డ్రగ్స్, ఒక ఫోన్‌ను స్వాధీనం చేసుకున్నారు.

పోయిన సొత్తు సగం రికవరీ..

- డిజిటల్ అరెస్ట్‌లో వృద్ధురాలి సొమ్ము కాజేసిన సైబర్స్..
- రాచకొండ సైబర్ క్రైమ్ పోలీసులకు సీపీ అభినందన

సిటీబ్యూరో, జనవరి 2(నమస్తే తెలంగాణ): డిజిటల్ అరెస్ట్‌తో డబ్బు కోల్పోయిన ఓ వృద్ధురాలికి రాచకొండ సైబర్‌క్రైమ్ పోలీసులు తిరిగి ఆ డబ్బును ఇప్పించారు. గత నెల 8వ తేదీన ఉప్పల్ ప్రాంతానికి చెందిన గీతా ఉపాధ్యాయ అనే 65 ఏండ్ల మహిళకు సైబర్ నేరగాళ్లు 'తాము పోలీసులమంటూ భయపెట్టి ఆమెను డిజిటల్ అరెస్ట్ చేశారు. మీపై మనీలాండరింగ్ కేసు నమోదైందంటూ బెదిరించి ఆమె బ్యాంకు ఖాతాలో ఉన్న డబ్బు, ఫిక్స్‌డ్ డిపాజిట్లు రద్దు చేయించి రూ.1,58,70,000 కాజేశారు. దీంతో బాధితురాలు రాచకొండ సైబర్‌క్రైమ్ పోలీసులకు ఫిర్యాదు చేయగా.. ఏసీపీ శివశంకర్ నేతృత్వంలో ఇన్‌స్పెక్టర్ మక్బూల్ జానీ బృందం కేసు దర్యాప్తు చేసింది. సైబర్‌నేరగాళ్లకు చెందిన ఉత్తరప్రదేశ్ మురబాద్‌లోని ఐసీఐసీఐ బ్యాంకులో డబ్బు డిపాజిట్ అయినట్లు గుర్తించి ఆ ఖాతాను ఫ్రీజ్ చేశారు. ఆ తరువాత న్యాయపరమైన చర్యలతో ఆ ఖాతాలో ఉన్న రూ.70,01,788 నగదును తిరిగి బాధితురాలి ఖాతాలోకి రప్పించారు. పోయిన సొమ్ములో దాదాపు సగం సొమ్మును బాధితురాలికి ఇప్పించడంలో స్పందించిన సైబర్ క్రైమ్ సిబ్బందిని డీసీపీ నాగలక్ష్మి, రాచకొండ సీపీ సుధీర్‌బాబులు అభినందించారు.

ఆహ్లాదకరంగా ఉద్యాన్ - ఉత్సవ్

బొల్లారం, జనవరి 2: ప్రకృతి ఔత్సాహికులకు, ఉద్యాన వన ప్రేమికులను మంత్రముగ్ధులను చేసే దృశ్యాలను అందించి పుష్పాలు, పుష్పేతర ప్రదర్శనల విస్తృత శ్రేణిని ప్రదర్శించడానికి 'ఉద్యాన్ - ఉత్సవ్' ఒక ప్రత్యేక వేదికగా నిలుస్తుందని రాష్ట్రపతి భవన్ అధికారి సమరేశ్ అన్నారు. బొల్లారం రాష్ట్రపతి నిలయంలో ఉద్యాన్ - ఉత్సవ్ ప్రదర్శనలను గురువారం ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా మినిస్ట్రీ ఆఫ్ అగ్రికల్చర్ అండ్ ఫార్మర్స్ వెల్ఫేర్ జాయింట్ సెక్రటరీ సామ్యూల్ ప్రవీణ్ కుమార్, మేనేజ్ డైరెక్టర్ డా. శరవణన్, షైక్ మీరా, డిపార్ట్‌మెంట్ ఆఫ్ అగ్రికల్చర్, తెలంగాణ ఏడీఏ హుస్సేన్ బాబు, ఫార్మర్ వెల్ఫేర్ అడిషనల్ కమిషనర్ సంజయ్ కుమార్, రాష్ట్రపతి భవన్ డైరెక్టర్ శివేంద్ర చతుర్వేది హాజరయ్యారు. ఈ సందర్భంగా రైతు సాధికారత సమితి, ఆంధ్రప్రదేశ్ కమ్యూనిటీ నిర్వాహిత సహజ వ్యవసాయ శాస్త్రవేత్తలు సహజ వ్యవసాయం హార్టికల్చర్ పద్ధతులు, ఆలుగడ్డ, అల్లం పంటలపై నిర్వహణ పద్ధతులు పంటల సంస్కరణలో మంచి హార్టికల్చర్ పద్ధతులు, కూరగాయల పంటల సాగుతో పాటు వివిధ సాంకేతికత అంశాలపైనా రైతులకు అవగాహన కల్పించారు. సౌత్ సెంట్రల్ జోన్ కల్చరల్ సెంటర్ ఆధ్వర్యంలో వివిధ రాష్ట్రాల సంస్కృతి సంప్రదాయాల నృత్యాలు, ఆదివాసీ నృత్యాలను, మహాభారతంలోని శ్రీకృష్ణ రాయబార ఘటాన్ని ప్రదర్శించి సందర్శకులను అలరించారు. ఉద్యాన్ - ఉత్సవ్‌లో భాగంగా వివిధ వర్సిటీల, ఎన్‌జీఓ, కమ్యూనిటీ ఆర్గనైజేషన్స్ నుంచి సుమారు 50 స్టాల్స్ ఏర్పాటు చేశారు. గురువారం ఒక్కరోజే సుమారు 6000 మంది సందర్శకులు, పాఠశాల, ఎన్‌సీసీ క్యాడెట్స్ విద్యార్థులు పాల్గొన్నారు. ఈ ఉత్సవాలు జనవరి 2 నుంచి 13 వరకు ప్రతి రోజు ఉదయం 10 గంటల నుంచి రాత్రి 8 గంటల వరకు ఉంటుందని, ప్రవేశం ఉచితమని నిలయం అధికారిణి రజినీ ప్రియ తెలిపారు. కార్యక్రమంలో రాష్ట్రపతి పబ్లిక్ రిలేషన్స్ అధికారి సురేశ్, సిబ్బంది పాల్గొన్నారు.


స్టాల్స్‌ను ప్రారంభిస్తున్న ప్రగతిశీల రైతు సురేశ్, అధికారులు